ప్రజాశక్తి
బుధవారం 17 జనవరి 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు

సంబరాల కోలాహలం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి, పల్నాడు జిల్లా

సంక్రాంతి సంబరాల్లో భాగంగా గుంటూరు, నరసరావుపేటలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆది, సోమవారాలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమకాలు ఏర్పాటు చేశారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్యర్యంలో ఎన్‌టిఆర్ స్టేడియంలో సినీ గాయకులు దామిని, శ్రీకృష్ణ, హారికా నారాయణ్, ఉమా నేహా, రవి జాకీ, డిటియస్ ఆనంద్‌తో స్టార్ మ్యూజికల్ మస్తి డాన్స్ హంగామా నిర్వహించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎంపి అయోధ్య రామిరెడ్డి, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని క్రీడా ప్రాంగణంలో సినీ సంగీత దర్శకులు రఘు కుంచె, సుమంత్ సునంద ఆధ్వర్యంలో సంగీత విభావరి

▶ 2లో

తెనాలిలో టిడిపి, జనసేన యుద్ధం

టిడిపి రెబల్‌గా ఆలపాటి రాజేంద్ర ? - నేడు కార్యకర్తలతో అత్యవసర భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెనాలిలో జనసేన, టిడిపి మధ్య పొత్తు ఫలించేలా లేదు. రాబోయే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా టిడిపి, జనసేన పొత్తుకు రాష్ట్రవ్యాప్తంగా సిద్ధమైనా తెనాలిలో చిక్కులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది. తెనాలిలో జనసేన అభ్యర్థిగా మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌ను ఎంపిక చేస్తున్నట్టు ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దాదాపు ఆరు నెలల క్రితమే ప్రకటించారు. అయితే ఈ నియోజకవర్గం నుంచి టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కూడా తాను ఇక్కడ నుంచే పోటీ చేస్తానని చెబుతున్నారు. కొన్ని రోజులుగా ఆయన నియోజకవర్గంలో పాదయాత్ర కూడా చేశారు. టిడిపి టిక్కెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగేందుకు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

టిడిపి నుంచి ఇప్పటి వరకు సీట్ల కేటాయింపుపై ఎలాంటి ప్రకటన రాకపోయినా నాదెండ్ల మనోహర్ ఇప్పటికే జనసేన అభ్యర్థిగా ప్రచారంలో ఉండటం, ఆలపాటికి ప్రత్యామ్నాయం గురించి టిడిపి అధిష్టానం నుంచి స్పష్టత రాలేదు. దీంతో ఆలపాటి గ్రూపు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఐదేళ్లుగా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని పనిచేస్తూ ప్రతిపక్షంలో చురుకైనపాత్ర పోషిస్తున్నా ప్రాతినిధ్యం కల్పించకపోతే ఎలాగని టిడిపి శ్రేణులు అంటున్నాయి. ఈ క్రమంలో గుంటూరు విద్యా నగర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మంగళవారం తన అనుచరులు, నియోజకవర్గం ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. తెనాలి సీటు జనసేనకు కేటాయిస్తారనే ప్రచారంతో తాము రాజీనామాలు చేస్తామంటూ ఆలపాటికి ద్వితీయ శ్రేణి నాయకులు చెప్పారు. అయితే పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూద్దామని వారికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సర్ది చెప్పారు. తనకు టిక్కెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా అయినా పోటీ చేస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో బుధవారం తెనాలిలో టిడిపి కార్యకర్తలతో రాజేంద్రప్రసాద్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. టిడిపి నిర్వహించిన సర్వేలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు గెలుపు అవకాశాలున్నాయని నివేదికలొచ్చినట్లు చెబుతున్నారు. అయితే జనసేన పార్టీలో పవన్ కల్యాణ్ తరువాత అన్నీ తానై చూస్తూ నంబరు-2గా పేరొందిన నాదెండ్ల మనోహర్‌కే ఆదిలోనే సమస్యలు ప్రారంభం అయ్యాయి. టిడిపి, జనసేన పొత్తుపై ఎన్నికలకు ముందుగానే అంతర్గత కలహాలు పెరుగుతుండటంతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత రాజకీయ పరిణామాలు ఎలా చోటుచేసుకుంటాయోనే ఉత్కంఠ నెలకొంది.

టిడిపి శ్రేణులపై వైసిపి దాడి

- వినుకొండలో ఉద్రిక్తత - పోలీస్‌స్టేషన్ ఎదుట టిడిపి, జనసేన ఆందోళన
- సోషల్ మీడియా వివాదంలో రాజీ ప్రయత్నం చేసే క్రమంలో మళ్లీ గొడవ

ప్రజాశక్తి - వినుకొండ

దాడిలో గాయపడిన టిడిపికి చెందిన షఫీ

టిడిపి నాయకులపై వైసిపి దాడితో వినుకొండలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. టిడిపికి చెందిన సద్దాం, వైసిపికి చెందిన హసన్ మధ్య గతంలో జరిగిన సోషల్ మీడియా వివాదం ఘర్షణకు దారితీసింది. పాత కేసు విషయం మాట్లాడి రాజీ చేసుకునేందుకు మధ్యవర్తుల సమక్షంలో తిమ్మాయపాలెం రోడ్డులోని వై కన్వర్షన్ హాల్ వద్ద చర్చిస్తుండగా షఫీ అనే వ్యక్తిపై దాడి చేయడం, దీనిపై స్థానిక పెద్ద మసీదు వద్దకు వచ్చి బంధువులను పిలిచి చెబుతుండడంతో వైసిపికి చెందిన వారు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారని బాధితులు షఫీ చెబుతున్నారు. ఈ ఘర్షణలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి షమీమ్ ఖాన్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్, బాబావాలి, అక్బర్ బాషా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న టిడిపి శ్రేణులు అభిమానులు నాయకులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. దీంతో పట్టణంలో ఉధత పరిస్థితి నెలకొంది. సిఐ సుధాకర్, ఎస్సైలు సంఘటన ప్రాంతానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. నరసరావుపేట డీఎస్పీ కెవి మహేష్ ప్రత్యేక బలగాలతో ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. క్షతగాత్రులను

▶ 2లో

కోటి సంతకాల సేకరణలో భాగంగా పెదనందిపాడులో శిబిరం వద్ద సంతకం చేస్తున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

వార్తలు లోపలి పేజీల్లో

సమస్యలను పరిష్కరించకుంటే తమకు ఉరేసుకోవడమే గతి అనే ఆవేదనకు చిహ్నంగా పల్నాడు జిల్లా వినుకొండలో ఉరితో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

గుంటూరు సమ్మె శిబిరంలో గంజి తాగుతున్న అంగన్వాడీలు

సంక్రాంతి వేళ సమ్మె నినాదం

క్రిస్మస్, న్యూ ఇయర్, భోగి, సంక్రాంతి, కనుమ తదితర పండుగులను ఇన్నాళ్లూ కుటుంబీకులతో కలిసి సంతోషంగా చేసుకున్న అంగన్వాడీలు ప్రస్తుతం తోటి అంగన్వాడీలతో కలిసి సమ్మె శిబిరాల్లోనే చేసుకుంటున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తేనే తమకు నిజమైన పండుగని ఆవేదనతో చెబుతున్నారు. ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలను పరిష్కరించకుంటే ఎన్ని పండగలనైనా సమ్మె శిబిరాల్లో చేసుకుంటామేగాని విరమించబోమని స్పష్టం చేశారు.

సత్తెనపల్లిని కప్పేసిన మంచు దుప్పటి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిని మంచు దుప్పటి కప్పేసింది. పొగ మంచు కారణంగా ఎదురు వచ్చే వాహనాలు కనపడక వాహనదారులు ప్రజలు అవస్థ పడ్డారు. వాహనదాలు లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నారు. 15 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి జంకారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలోని సంతగుడిపాడు జెడ్‌పి పాఠశాల 1997-98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం ఘనంగా జరిగింది. వారంతా తాము చదువుకున్న పాఠశాలలు, తరగతి గదుల్లో కలియతిరిగి నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. చిన్న పిల్లల్లా మారి ఒకరిపై ఒకరు జోకులేసుకుంటూ నవ్వులు పంచుకున్నారు. కుటుంబాలు సహా తరలివచ్చిన పూర్వ విద్యార్థులు తోటివారితో సందడిగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు కోటయ్య స్వామి, అప్పలరాజు, రసూల్, వేణుగోపాలరావు, వీరాంజనేయులు, మురళీధర్‌రావు, సరళ, మహబూబ్ సుభానీ, చింతా పుల్లయ్యతోపాటు ప్రస్తుత హెచ్‌ఎం కె.శ్రీనివాసరావును సత్కరించారు. తొలుత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని విశ్రాంత హెచ్‌ఎం కె.పిచ్చిరెడ్డి ఆవిష్కరించారు.

క్రీడల నిర్వహణే గ్రామ ఐక్యతకు నిదర్శనం

ప్రజాశక్తి-ఈపూరు

రైతుమిత్ర ఆధ్వర్యంలో 32వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు మండలంలోని ఎ.ముప్పాళ్లలో సోమవారం నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు హాజరై కబడ్డీ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు. 32 ఏళ్లుగా ఈ పోటీలు నిర్వహించడం హర్షణీయమని అభినందించారు. క్రీడల వల్ల స్నేహభావం అలవడుతుందని, శారీరకంగానూ మనిషిని క్రీడలు ధృడంగా చేస్తాయని చెప్పారు. కలిసికట్టుగా విజయాన్ని ఎలా సాధించాలో క్రీడల్లో మనం గమనించొచ్చని, జీవితంలోనూ దీన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, నాయకులు యు.రాము, ఎస్.బ్రహ్మయ్య, ఎస్.అప్పారావు, యు.రామారావు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాగేశ్వరరావు

'దింతెనపాడు గ్రామ చరిత్ర' ఆవిష్కరణ

ప్రజాశక్తి - యడ్లపాడు

భారత హేతవాద సంఘ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ రచించిన 'దింతెనపాడు గ్రామ చరిత్ర' గ్రంథాన్ని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు దింటెనపాడులో సోమవారం ఆవిష్కరించారు. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన, ఎంతో మంది విద్యావేత్తలను అందించిన గ్రామ చరిత్రను అందరూ తెలుసుకో వాలని, ఈ గ్రంథ రచన కోసం రచయిత పడిన శ్రమ వెలకట్టలేనిదని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉపాధ్యాయిని రావి నాగేశ్వరి అధ్యక్షత వహించగా శాసన పరిశోధకులు, విశ్రాంత ఉపాధ్యా యులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ దింతెనపాడు చరిత్ర గ్రంథంలో తాను భాగస్వామి కావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కొణిదన రాజధానిగా ఈ ప్రాంతాన్ని ఏలిన చోళ రాజులు ఈ గ్రామంలో చెన్నకేశవ ఆలయాన్ని నిర్మించారన్నారు. కవిరాజు సాహితి సమితి అధ్యక్షులు ఆలోకం పెద్దబ్బయ్య, సినీ నటులు చిట్టినేని లక్ష్మీనారాయణ, విశ్రాంత అధ్యాపకులు కుడారి జగదీశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టుల ప్రభావంతో ఈ గ్రామంలో విద్యపై మక్కువ పెరిగిందని, విద్య జీవితాలను మారుస్తుందనేందుకు తమ జీవితమే సాక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.యామిని, షేక్ బాబు, డి.వీరాంజనేయులు, డి.చౌదరి, జి.కోటేశ్వరరావు, బి.పూర్ణచంద్రరావు, రాజేంద్రప్రసాదు, ఎన్.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాస రావు, ఎం.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మాడిశెట్టి మోహన్ మృతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణానికి చెందిన వైసిపి నాయకులు, 29వ వార్డు మాజీ కౌన్సిలర్ మాడిశెట్టి మోహన్ (37) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఇటీవల గుండెపోటు రావడంతో స్టెంట్ వేయించుకున్న మోహన్ సోమవారం అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఒ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతి చిన్న వయసులో రాజకీయాల్లో ప్రవేశించిన మోహన్ వైసిపి ఆవిర్భావం నుండి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. మోహన్ భౌతికకాయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించి పూలమాలలేసి నివాళు లర్పించారు. పలువురు వైసిపి నాయకులు నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైసిపిలో కీలకంగా వ్యవహరించిన మోహన్ కోవిడ్ సమయంలో పలు సేవా కార్యక్రమాలు చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇన్‌సెట్‌లో మృతుడు మాడిశెట్టి మోహన్ (ఫైల్)

పేద విద్యార్థులకు చేయూతనిస్తాం : అవోప

ప్రజాశక్తి - మాచర్ల

ప్రతిభావంతులైన పేద విద్యార్థులను గుర్తించి వారికి ఆర్థికంగా సహయం అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆవోపా అధ్యక్ష, కార్యదర్శులు జెవికెఎస్ ప్రసాదు, ఓరుగంటి చెన్నకేశవరావులు తెలిపారు. స్థానిక వెంకటవాణి చిట్‌ఫండ్ కార్యాలయంలో 2024 వార్షిక కేలండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజులు, నోట్ పుస్తకాలు తదితర రూపాల్లో సాయం అందిస్తా మన్నారు. త్వరలో ఆవోపా ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అవోప నాయకులు సిహెచ్.వెంకటేశ్వర్లు, ఆర్.లక్ష్మీనారాయణ, టి.ఈశ్వరయ్య, ఆర్.ప్రసాదు, టి.వెంకట నాగేశ్వరరావు, పి.నరసింహరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అవోప నాయకులు

వరికపూడిశెల పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు ప్రజల చిరకాల కోర్కైన వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పనులను తక్షణమే ప్రారంభించాలని పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 100 గ్రామాలకు తాగునీరు, లక్ష ఎకరాలకు సాగునీరు అందడం ద్వారా బొల్లాపల్లి, వెల్దుర్తి, దుర్గి, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలాల్లోని గ్రామాలు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. ఆయా ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందితే స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే పనులు ప్రారంభిస్తే సజావుగా సాగే అవకాశం ఉందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రాజెక్టు నిర్మాణంపై మాటలు చెప్పడం, గెలిచాక మౌనంగా ఉండటం పాలక పార్టీలకు పారిపాటైందని, వరికపూడిశెల ప్రాజెక్టు కంటే వెనుక మొదలుపెట్టిన పులిచింతల పూర్తి చేశారని పేర్కొన్నారు. వరికపూడిశెలకు బడ్జెట్ కేటాయింపుపై ఇంకా స్పష్ట లేదని, ఈ నేపథ్యంలో ప్రజలంతా ఐక్యంగా మరోసారి పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కోడిగుడ్లలో పురుగులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

బాలింతలకు, గర్భిణులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే కోడి గుడ్లలో పురుగులు దర్శనిమిచ్చాయి. గురజాల పట్టణంలోని మూడో సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో అందించే కోడిగుడ్లలో పురుగులు రావడంతో స్థానికులు భయపడ్డారు.

నిబద్ధత పాత్రికేయుడు కెకె మూర్తి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నిజాయితీగా పనిచేసిప్రజా సమస్యల పరిష్కారానికి సీనియర్ పాత్రికేయులు కోటా కృష్ణమూర్తి కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి జ్ఞానరాజ్‌పాల్ అన్నారు. కెకె మూర్తి సంస్మరణ సభ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించగా దళిత మహాసభ ఉపాధ్యక్షులు కె.ఆంథోని అధ్యక్షత వహించారు. జానరాజ్‌పాల్ మాట్లాడుతూ కృష్ణమూర్తి సత్తెనపల్లిలో పలు పత్రికలకు జర్నలిస్టుగా పనిచేసి ఎంతో మంచిపేరు తెచ్చుకున్నారని చెప్పారు. ప్రస్తుతం ఆయన కేకే న్యూస్, కేకే మ్యూజిక్, రాగ మంజరి, మొదలగు వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి తాజా వార్తలు, కొత్తవారితో పాటలు పాడిస్తూ ఆయన పాడుతూ ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. కార్యక్రమంలో కె.హనుమంతరావు, షేక్ చాంద్‌బాషా, ఎం.సాంబశివరావు, కెబిఆర్‌జె ప్రసాద్, ఆర్.పురుషోత్తం, టి.రామకృష్ణ, జె.పాల్‌రాజు, కేకే మూర్తి కుమార్తె, న్యాయవాది కె.దీప్తి, రోహిణి కృష్ణ పాల్గొన్నారు.

సంబరాల కోలాహలం

(మొదటి పేజీ తరువాయి)

ఆలరించింది. జబర్దస్త్ బృందం ఇమ్మానుయేల్, శాంతి స్వరూప్, గడ్డం నవీన్, చిత్రం శ్రీను తమ ప్రదర్శనలతో సందడి చేశారు. ప్రత్యేకంగా డాన్స్ ప్రోగ్రాం అలరించింది, రష్యన్ క్విక్, చేంజ్ డాన్స్ ప్రోగ్రాం, కల్చరల్ ప్రోగ్రామ్స్, చిన్నారుల డాన్సులు అలరించాయి. చిన్నారుల శివుని నృత్య ప్రదర్శన, డంబుల్స్ డాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పల్నాడు జిల్లాకు సంబంధించి లేజర్ షో ఆకట్టుకుంది. వందేళ్లకు పైబడిన వారిని, క్రీడల్లో రాణించిన వారిని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్ దంపతులు, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఆర్ఒ వినాయకం, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణులపై వైసిపి దాడి

(మొదటి పేజీ తరువాయి)

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు పరామర్శించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడే ఇలా చేయిస్తున్నారంటూ టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యేతోపాటు దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్ గేటు వద్ద బైఠాయించారు.ాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ హామీతో ఆందోళన విరమించారు.

నేడు పల్నాడు జిల్లాలో వెంకయ్య నాయుడు పర్యటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట జొన్నగడ్డ పరిధిలో పాత సాయి తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంబోత్సవానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరుకానున్నట్లు స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపి లావు శ్రీకష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
బుధవారం 17 జనవరి 2024

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

భారతీయ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక అయిన సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు.సోమవారం గుంటగ్రౌండ్ లో గుంటూరు అర్బన్ పార్టీ అధ్యక్షులు డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పాకనాటి రమాదేవి,బిట్రాగుంట మల్లికా,డేగల భువనేశ్వరి,బండ్లమూడి లక్ష్మిరాధా దేవి,గంట మౌలిక హాజరయ్యారు. రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. రకరకాల ముగ్గులు చూడముచ్చటగా అనిపించాయి.ముగ్గుల పోటీలకు మహిళలు భారీగా తరలి వచ్చారు. ప్రతిఒక్కరినీ అబ్బురపరచిన ముగ్గులు సంక్రాంతి శోభను తలపించాయి.ఈ పోటీల్లో 120 మంది మహిళలు పాల్గొన్నారు.విభిన్న అంశాలపై అచ్చెరువొందించే ముగ్గులు అలంకరించారు.హరిదాసులు, ధాన్యపు సిరులు, అమ్మవార్లను, చెరకు గెడలు,గొబ్బెములతో ముగ్గులు అలంకరించారు. ప్రథమ బహుమతి సాధించిన బోయ ఉమాదేవి కు రూ.25 వేల నగదు బహుమతి అందుకున్నారు. ఆమె ముగ్గు ప్రథమ బహుమతి కింద ఎంపికవడంతో భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. లత ద్వితీయ బహుమతి దక్కించుకోగా రూ.15వేల నగదు బహుమతి అందుకున్నారు. గాదే లలిత తతీయ బహుమతి కింద రూ.10 వేలు అందుకున్నారు. టి భారతి

గుంటూరులో

పెదనందిపాడులో

నాలుగో బహుమతి రూ.3వేలు, బి మాధవి ఐదో బహుమతి రూ.2 వేలు నగదు బహుమతి అందజేశారు.మిగిలిన వారందరికీ చీరలను అందించారు.ఈ కార్యక్రమంలో బొక్కిసమ్ శివరామ్, పాకనాటి రమాదేవి బిట్రగుంట మల్లిక, తాడివాక సుబ్బారావు, కార్పొరేటర్ పోతురాజు సమంత,కొత్తూరి వెంకట్ తదితరులుపాల్గొన్నారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గం 51 వ డివిజన్ వల్లూరి వారి తోటలో లో శ్రీ భ్రమరాంబికా యూత్ వారి ఆధ్వర్యంలో సంక్రాతి సంబరాలు మంగళవారం జరిగాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గం టిడిపి ఇంచార్జి మొహమ్మద్ నసీర్ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. వివిధ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలకు శు భాకాంక్షలు తెలియచేశారు. కార్పొరేటర్ ముప్పవరపు భారతి, టిడిపి నాయకులు మహంకాలి నరసింహ రావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మానసికల్లోసానికి క్రీడలు దోహదపడతాయని ఎంపీపీ హెప్సీబా. అబ్బినేని గుంట పాలెం సొసైటీ చైర్మన్ కూరేటి భూషయ్య అన్నారు. పెదనందిపాడు శివాలయం వీధిలో ఎస్ఎస్ యూత్ అధ్యక్షులు కొమ్మినేని గోపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా రెండు రోజుల నుంచి జరుగుతున్న క్రీడా పోటీలు మంగళవారం రాత్రి తో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవ సభకు సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు సినీ దర్శకులుచెరుకూరి సాంబశివరావు అధ్యక్షత వహించగా ముగ్గులు పోటీల్లో వరసగా బహమతులను పొందిన ఎన్ లోవా. కే సుజాత . ఎస్ రూప శ్రీలకు ఎంపీపీ హెబ్సిబా బహుమతులను అందజేశారు. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అతిధులు అందజేశారు. న్యాయా నిర్నేతలగాలోకేష్ . సురేష్. ప్రవల్లిక. రమణ . అంబేద్కర్. కిషోర్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీలు షేక్ ఖాసింబి. కె సాంబశివరావు. ఎంపీటీసీలు మాలతి. సుందర్ లు. దిరిశాల రమేషు గణేషు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు..

ఆరెస్ట్ చేసిన నిందితులతో సిఐ రమేష్‌బాబు, సిబ్బంది

దారి దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-తెనాలి :అర్ధరాత్రి వేళ దాడి చేసి, దోపిడీకి పాల్పడిన ఇరువురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సిఐ రమేష్‌బాబు వెల్లడించిన వివరాల ప్రకారం మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన లారీ డ్రైవర్ జలసూత్రం సుబ్బారావు ఈనెల 15 అర్ధరాత్రి డ్యూటీ దిగి ఇంటికి వెళ్ళేందుకు రైల్వే స్టేషన్ రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద వేచి ఉన్నాడు. అదే సమయంలో పట్టణంలోని మల్లెపాడుకు చెందిన వరగాని వర్ధన్, ఆర్ ఆర్ నగర్ కాలనికీ చెందిన షేక్ సంధాని కూడబలుక్కుని సుబ్బారావుపై దాడిచేసి, అతని జేబులో ఉన్న రూ.4వేలు లాక్కుని, ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను రైల్వే స్టేషన్ వద్ద అరెస్ట్ చేశారు. వెంటనే స్పందిచి నిందితులను గుర్తించటంలో సహకరించిన ఏఎస్ఐలు దేవా ప్రసాద్, షేక్ హైదరాలి, కానిస్టేబుల్స్ పి.మురళి, అంకయ్యను సిఐ అభినందించారు. సమావేశంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణా మద్యం స్వాధీనం
ఇద్దరు అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-తెనాలి

అనధికారికంగా తెలంగాణా మద్యం విక్రయిస్తున్న ఇరువురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సిఐ రమేష్‌బాబు వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక సుల్తానాబాద్‌కు చెందిన కాబోతు శ్రీను నాయక్, రమావత్ కార్తీక్ నాయక్ జల్సాలకు, చెడు వ్యసనాలకు అలవాటు పడి అడ్డదారిలో అక్రమార్జనకు తెరతీశారు. దీనిలో భాగంగా ఇరువురూ కలిసి తెలంగాణా రాష్ట్రంలోని కోదాడ టౌన్‌కు వెళ్ళి మద్యం కొనుగోలు చేసి పట్టణంలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో తెలంగాణా నుంచి తెచ్చిన మద్యం 50 ఫుల్ బాటిల్స్‌ను గోతాములో పెట్టుకుని, సుల్తానాబాద్‌లోని అడుసుమల్లి శ్రీ కనకదుర్గా బార్ అండ్ రెస్టారెంట్‌కు సమీపంలో విక్రయిస్తున్నారు. బార్‌లోకి వెళుతున్న వారిని అటకాయించి, వారి వద్ద చౌకగా మద్యం దొరుకుతుందని ఆశ చూపి, ఫుల్ బాటిల్‌కు రూ.310 లాభం చూసుకుని ఫుల్ బాటిల్‌ను రూ.1000కి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న సిఐ తమ సిబ్బందైన ఎస్ఐ ఎం.విజయకుమార్, ఏఎస్ఐ హైదర్ ఆలి, కానిస్టేబుల్స్ మురళి, ఎం.అంకయ్యలతో కలిసి దాడి చేసి, వారి నుంచి మద్యం బాటిల్స్ స్వాదీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సమావేశంలో స్టేషన్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పిఆర్‌కె - పివిఆర్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - మాచర్ల

సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని నెహ్రూ నగర్ పిఆర్‌కె – పివిఆర్ యూత్, నాలుగో వార్డ్ కౌన్సిలర్ రామిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ రంగవల్లుల పోటీ నిర్వహించారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది మరుమముల శ్రీనివాస్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా సిహెచ్ పద్మావతికి వాషింగ్ మిషన్, రెండు బహుమతిగా పి.అనూషకు గ్రైండర్ అందించారు. మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన వారికీ ప్రత్యేక బహుమతులు అందించడంతోపాటు పాల్గొన్న 175 మందికి చీరలు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరు నరసింహారావు, మాజీ చైర్మన్లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, కౌన్సిలర్ రామాంజిరెడ్డి, గట్ల కోటిరెడ్డి అరుణ, అలీ, జీవన్, కొమ్మిరెడ్డి గిరివర్ధన్ రెడ్డి, కొమ్మారెడ్డి అంజిరెడ్డి, మంజుల మల్లికార్జునరావు, నర్రాదుర్గారెడ్డి, కొండా బ్రహ్మారెడ్డి మారెబోయిన కృష్ణ, కొండసాని మంగిరెడ్డి పొట్లపాటి వెంకటరెడ్డి పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా డాక్టర్ కమలహాసన్, డాక్టర్ అనురాధ, అనిల్ వ్యవహరించారు.

అట్టహాసంగా ఐగ్రో స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా కలెక్టర్

ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ 7వ వార్షికోత్సవం, సంక్రాంతి వేడుకలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ చదువుతోపాటు తమకు ఇష్టమైన ఆటపాటలలో పాల్గొనడం వల్ల శారీరకంగా, మానసికంగా దఢంగా ఉంటారని చెప్పారు. జన్మభూమిని ప్రేమించాలని, జీవితంలో లక్ష్యం నిర్దేశించుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ సూర్యారావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పిల్లలు ఉన్నత విలువలు అలవరచుకోవాలని, ఆ విలువలే జీవితాంతం విజయం వైపు నడిపిస్తాయని అన్నారు. పాఠశాల చైర్మన్ పల్లబోతుల వెంకట్, వైస్ ఛైర్మన్ పల్లబోతుల మురళి మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల వారికి సాధారణ ఫీజులతో కార్పోరేట్ స్థాయి విద్య అందిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. నాణ్యమైన విద్య అందించే విషయంలో రాజీ పడేదిలేదన్నారు. రానున్న కాలంలో మరింత ఉన్నత ప్రమాణాలతో పాఠశాలను తీర్చిదిద్దుతామని చెప్పారు. వేడుకలు సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు పలు సాంస్కతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ దీవి వెంకట శేషశాయి, వైస్ ప్రిన్సిపల్ యెండ్లూరి చంద్రబాబు, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ విశ్వనాథ్, సాయిబాబా, సాయి, సభ్యులు వేల్పుల సింహాద్రి యాదవ్, సత్యనారాయణ, రోటరీ క్లబ్ పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ జిలానీ మాలిక్ పాల్గొన్నారు.

కాశిపాడులో క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి పెదకూరపాడు :మండలంలోని కాశిపాడులో మంగళవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు రూ.5 వేల నగదు బహుమతి అందించారు. జనసేన మండల అధ్యక్షుడు మల్లెల వెంకట చలపతిరావు, నాయకులు హనుమంతరావు, పెదకూరపాడు కాపునాడు అధ్యక్షులు బుచ్చిబాబు, మల్లెల రామాంజనేయులు, గొర్రె చంద్రం, మల్లెల వెంకటేశ్వరరావు, కొత్త శెట్టి యాదాద్రి, యశ్వంత్ పాల్గొన్నారు.

సర్పంచ్‌పై కేసు

ప్రజాశక్తి దుగ్గిరాల

మండలంలోని తుమ్మపూడి, పేరుకలపూడి గ్రామాలలో టిడిపి సహకారంతో ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలు పగలగొట్టారు. తెనాలి - విజయవాడ రహదారి పక్కన తుమ్మపూడి గ్రామ పరిధిలో బస్సు స్టాప్ వద్ద ప్రయాణికులు కూర్చోవడానికి ఏర్పాటుచేసిన మూడు సిమెంట్ బల్లలు ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టారు. దీనితో ఎంపీటీసీ వాసిరెడ్డి పద్మ, టిడిపి నాయకులు నర్రా శ్రీనివాస రావు ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తమ పార్టీ అభ్యర్థి సర్పంచ్‌గా ఉన్నపుడు ఏర్పాటు చేసిన నాలుగు బల్లలు, దాతలు ఏర్పాటు చేసినవి పగులగొట్టారని, ప్రస్తుత సర్పంచ్ గంపల గంగాధర్ పగులగొట్టారని, గ్రామస్థులు కూడా ఈ విషయాన్ని తెలిపారని వారు చెప్పారు. ప్రదర్శన అనంతరం దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌లో గ్రామ సర్పంచ్ గంపల గంగాధరరావుపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఇన్‌ఛార్జి ఎస్ఐ మరియు ట్రైనీ డిఎస్‌పి గీతా కుమారి కేసు దర్యాప్తు చేపట్టారు.

కోడి పందేలు నిర్వహిస్తున్న 10 మంది అరెస్టు

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

నిషేధిత కోడిపందాలు నిర్వహిస్తున్న 10మంది వ్యక్తులను రూరల్ యస్ ఐ భార్గవ్ అరెస్టు చేసి వారివద్ద నుండి 10 కోడి పుంజులు రూ.4550 స్వాధీనం చేసుకున్నారు. యస్ఐ భార్గవ్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామం పంటపొలాల్లో ఆడుతున్న విషయం తెలుసుకొని సిబ్బందితో దాడి చేసి వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారికి కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.

చర్మకారుల రుణాలకు ఎమ్మెల్సీకి వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

చర్మకారులకు రుణాలు మంజూరు చేయించాలని కోరుతూ మంగళగిరి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ చర్మకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు వినత పత్రం అందజేశారు. నియోజ కవర్గంలో 250 మంది చర్మకారులు, డప్పుకళాకారులున్నారని, వారికి ప్రభుత్వ పరంగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ మురుగుడు మాట్లాడుతు ముఖ్యంత్రి వైఎస్ జగన్‌కు చెప్పి సమస్యను పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

విద్యుత్ షాక్‌తో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-ఈపూరు

విద్యుత్ షాక్ తగిలి వ్యక్తికి గాయాలైన సంఘటన మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అక్కిపల్లి శ్రీకాంత్ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఫీజులు సరి చేసే క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అవటంతో చేతికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఈపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పతకం తెచ్చేదాక విశ్రమించను

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణానికి చెందిన జాతీయ క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా పదేళ్లుగా భారతదేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలో పరుగు పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించినా ఒలింపిక్స్‌లో పాల్గొనాలనే ఆశయం సాకారం కావడం లేదు. సరైన శిక్షణ, ఆర్థిక స్తోమత ఇందుకు అవరోధాలుగా మారిన నేపథ్యంలో పట్టణానికి చెందిన కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు అందించిన సహకారంతో హిమాచల్ ప్రదేశ్‌లోని ఉత్తరాఖండ్‌కు చెందిన ఒలింపిక్ కోచ్ కెప్టెన్ అమ్లేష్ కుమార్ వద్ద శిక్షణ కోసం చేరినట్లు అబ్దుల్లా ఓ ప్రకటనలు తెలిపారు. ఎంతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికే శిక్షణిచ్చేందుకు కెప్టెన్ ఆమ్లేష్ కుమార్ అంగీకరిస్తారని, కఠినమైన పరీక్షలో పాల్గొని అర్హత సాధించానని తెలిపారు. కొన్ని నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఇందుకు అవసరమైన ఆర్థిక వెసులుబాటు కోసం మరింత మంది దాతలు సహకరించాలని కోరారు. శిక్షణానంతరం ఒలింపిక్స్ పోటీల్లో భారతదేశానికి బంగారు పతకం సాధించేవరకు విశ్రమించబోనని పేర్కొన్నారు.

పవర్ లిఫ్టర్ నాగేశ్వరరావుకు కిట్‌ను అందిస్తున్న వెంకట అప్పారావు

పవర్ లిఫ్టర్‌కు స్పోర్ట్స్ కిట్స్ బహూకరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పవర్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో మోడల్స్ సాధించిన క్రీడాకారునికి జనసేన పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొర్రా వెంకట అప్పారావు స్పోర్ట్స్ కిట్స్‌ను సోమవారం అందించారు. మండలంలోని గుడిపూడికి చెందిన లింగిశెట్టి నాగేశ్వరరావు రాష్ట్రస్థాయిలో జూనియర్ విభాగంలో రెండు గోల్డ్ మెడల్స్, సీనియర్ పవర్ లిఫ్టింగ్ విభాగంలో రెండు సిల్వర్ మెడల్స్ సాధించాడు. కార్యక్రమంలో జనసేన పార్టీ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు ఎన్.నాగేశ్వరరావు, కోచ్ పసుపులేటి సురేష్, జయంత్, రవికిరణ్, సాయికృష్ణ, మణి, నరసయ్య పాల్గొన్నారు.

ఎంపి విజయసాయిరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న లాయర్లు

ఎంపీ విజయసాయిరెడ్డికి లాయర్ల విన్నపం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు నిమిత్తం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని కలిసి విన్నవించారు. ఇందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఫైల్ ఆర్థిక శాఖ వద్ద ఉన్న దృష్ట్యా మంజూరు చేయాలని ఎంపీ సూచించారు. ఎంపీని కలిసిన వారిలో బార్ అసోసియేషన అధ్యక్షులు సిహెచ్.వీరాంజనేయ చౌదరి, కార్యదర్శి కె.హనుమంతరావు, ఎజిపి ఎంఎన్. ప్రసాద్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కె.చెన్నకేశవరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు వి.బ్రహ్మారెడ్డి, న్యాయవాదులు ఉన్నారు.

జీతాలు పెంచినప్పుడే అంగన్వాడీలకు నిజమైన పండగ

36వ రోజుకు అంగన్వాడీల సమ్మె - పండగ రోజుల్లోనూ శిబిరాలకు తరలివచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం 36వ రోజు కొనసాగింది. పండగరోజుల్లోనూ అంగన్వాడీలు సమ్మె శిబిరాలకు తరలివచ్చారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని స్టేషన్ రోడ్డు గాంధీ పార్కు ధర్నాచౌక్ వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి సందర్శించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీల వేతనాలు పెంచిన రోజే అంగన్వాడీలకు నిజమైన పండుగన్నారు. ఐదుసార్లు చర్చలకు పిలిచినా అవి ఆద్యంతం బెదిరింపు ధోరణిలో కొనసాగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలుండాలని, సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ ఇచ్చిన జీవో 2ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కెపి మెటిల్డాదేవి, నాయకులు ఆదిలక్ష్మి, వెంగమాంబ, సుహాసిని, కరీమున్, అజి, అమీరున్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

సురేష్ మహల్ రోడ్‌లోని అంగనవాడి శిబిరం కొనసాగుతోంది. శిబిరాన్ని సోమవారం జాషువా సాంస్కృతి సమైక్య అధ్యక్షులు, విశ్రాంత ఎంఇఒ జాన్‌సుందరరావు సందర్శించి మద్దతుగా మాట్లాడారు. శిబిరం ఆవరణలో అంగన్వాడీలు భారీ రంగవల్లులతోపాటు పొంగళ్లు చేశారు మంగళవారం శిబిరాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా నాయకులు పి.రూబెన్ సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. అంగన్వాడీలకు పండగ సంతోషాన్ని ప్రభుత్వం దూరం చేసిందని, నిద్రాహారాలు మాని సమ్మె శిబిరంలో ఉండాల్సిన దుస్థితి కల్పించిందని విమర్శించారు. ఇంట్లో ఆడపడుచు కన్నీరు పెడితేనే ఇల్లంతా అంతే ఉంటుందని, దీనిపై ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఇదిలా ఉండగా తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే తమకు ఉరేసుకోవడం మినహా మరో మార్గం లేదనే సంకేతాన్నిస్తూ అంగన్వాడీలు ఉరితాళ్లతో నిరసన తెలిపారు. సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, ఎ.ఆంజనేయులు, ఎఐటియుసి నాయకులు ఎ.మారుతి వరప్రసాద్, అంగన్వాడీ నాయకులు లక్ష్మీ ప్రసన్న, జి.పద్మ, నిర్మల, బీబులు, కృష్ణకుమారి, ఉమాశంకరి, గాయత్రి శ్రీదేవి, హరిత పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో సమ్మె శిబిరం కొనసాగుతోంది. యూనియన్ నాయకులు ఉషారాణి మాట్లాడారు. ఇందిర, కె.పద్మావతి, శాంతలత, కోటేశ్వరి, సుందరలీల, శారద, దుర్గా శివలక్ష్మి, రుక్మిణి, జయలక్ష్మి, శివపార్వతీ, లీలావతి, వెంకటరమణ, సైదమ్మ, చిలకమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలో సమ్మె శిబిరం కొనసాగుతోంది. ఎద్దుకు వినతిపత్రం ఇస్తూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చిన్నం పుల్లారావు మద్దతుగా మాట్లాడారు. మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, అంగన్వాడి నాయకులు డి.శాంతమణి, షేక్ హజ్ర, బుజ్జి, కవిత, పీర్మాభి, ఆష, హసీనా, గురవమ్మ, విజయరాణి, సువర్ణ, రాణి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం కొనసాగుతోంది. సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడారు.

పేదల ఆకలి తీరుస్తున్న డాక్టర్ కడియాల

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

స్థానిక పల్నాడు రోడ్డులో పువ్వాడ హాస్పిటల్ దగ్గర టిడిపి డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, యువ నాయకులు డాక్టర్ లలిత్ సాగర్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నక్యాంటీన్ నిర్వహణ 150కుపైగా రోజుల నుండి కొనసాగుతోంది. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటిన్‌లో రూ.5కు భోజనం అందించగా ప్రస్తుతం తాము సొంత నిధులతో ఉచితంగా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజకీయాలతో సంబంధం లేదన్నారు. వివిధ రకాల పనులు చేసుకునే కార్మికులు, కూలీలు, ఇతర నిరాశ్రయులు రోజుకు 500 మంది వరకు భోజనం చేస్తున్నారన్నారు. పేదలకు భోజన వసతి ఏర్పాటు చేయడం తనకు ఎంతో సంతృప్తి కలిగిస్తోందని చెప్పారు. భోజనం చేసేందుకు వచ్చిన వారు మాట్లాడుతూ రోజు కూలి పనికి వెళ్లి ఉదయం అల్పాహారానికి రూ.50, భోజనం చేసేందుకు రూ.100 ఖర్చు చేయాల్సి వస్తోందని, కూలి డబ్బుల్లో సగం భోజనం, ప్రయాణ ఖర్చులకే సరిపోతోందని, ఇంటికి పూర్తిగా తీసుకెళ్లలేకపోతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. అయితే డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

రూ.80 లక్షలు ఖర్చుచేసినా దుర్గంధమే

ప్రజాశక్తి - అచ్చంపేట



అచ్చంపేటలోని రాజీవ్ నగర్ కాలనీవాసులు మురుగునీరు పోయే మార్గం లేక దుర్గంధంతో అవస్థలు పడుతున్నారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు అన్నారు. కాలనీలో సిపిఎం నాయకులతో కలిసి మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడుతూ రూ.80 లక్షలతో రాజీవ్ నగర్ కాలనీలో డ్రెనేజీ కాల్వలు ఏర్పాటు చేసినా ప్రణాళికేమీ లేకుండా నిర్మించడంతో మురుగు నిలుస్తోందని చెప్పారు. దుర్గంధంతోపాటు రాత్రివేళల్లో దోమలు బెడదతో కాలనీవాసులు అల్లాడిపోతున్నారని, స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హనుమంతరావు, ఆర్.పెద్దవెంకటేశ్వర్లు, ఎస్‌కె.హసన్, కె.గోపికృష్ణ, షేక్ సుభాని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గంజిమాల రవిబాబు

సమ్మె శిబిరాల్లోనే సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్ :తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని తమ న్యాయమైన కోరికలు పరిష్కరించాలని 36 రోజుల నుంచి అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం సమంజసం కాదని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి ప్రభుత్వాన్ని విమర్శించారు. పోరాటాల పుట్టినిల్లు అయిన పెదనందిపాడులో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె వృధా కాదని పట్టుదలతో పోరాటం చేసి విజయం సాధించాలన్నారు. మంగళవారం పెదనందిపాడులో అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు. సిఐటియు జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావుతో కలిసి సందర్శించి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని రమాదేవి ప్రారంభించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి సమంజసం కాదన్నారు. ప్రభుత్వ ధోరణిలో మార్పు రాకపోతే సమ్మె ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లారైతు సంఘాల నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, మండల అంగన్వాడీ సంఘ అధ్యక్ష కార్యదర్శులు శివపార్వతి శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : అంగన్‌వాడీలు మంగళవారం సమ్మె శిబిరంలో పండుగ చేసుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న అల్పాహారాన్ని అక్కడే భుజించారు. 36వ రోజుకు చేరిన అంగన్‌వాడీల దీక్షలనుద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు ఇతర సదుపాయాలు అందించాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. సిఎం జగన్ నాడు ప్రతిపక్ష నాయకుని హోదాలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు, అంగన్‌వాడీలు లక్ష్మి, సుజాత, భవానీ, శ్రీదేవి, సరళ, తబిత, కిరణ్మయి, మాధురి, ఫాతిమ, మాణిక్యం, వరలక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు : వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర డిమాండ్లతో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 36వ రోజుకు చేరుకుంది. గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో ప్రభుత్వ మొండి వైఖరి వల్ల తాము పండుగ రోజూ అర్ధాకలితో జీవిస్తున్నామని తెలియజేస్తూ మంగళవారం అంగన్‌వాడీలు గంజి తాగి నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.నాగబ్రహ్మాచారి పాల్గొని సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల చరిత్రను మరిచిపోయి ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. లక్షల మంది మహిళా స్కీమ్ వర్కర్లను నిర్లక్ష్యం చేస్తే త్వరలో జరిగే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా, సానుకూల ధృక్పదంతో ముందుకు వచ్చి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ మాట్లాడుతూ అంగన్‌వాడీల డిమాండ్ల విషయంలో ప్రభుత్వం ఇంత మొండిగా ఉండటం బాధాకరమన్నారు. నెల రోజులుగా మహిళలు ఇళ్లు, ఉద్యోగాలు వదిలి రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని నియంతృత్వ ప్రభుత్వమని అన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకూ సమ్మె కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు గుంటూరు తూర్పు నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ యూనియన్, నగర అధ్యక్ష, కార్యదర్శులు చిన్నవెంకాయమ్మ, టి.రాధ తదితరులు ప్రసంగించారు.

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో అంగన్వాడీలు కనుమ పండుగను జరుపుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమ ంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, అంగన్వాడి యూనియన్ నాయకులు హేమ లత, మేరీ రోజమ్మ, ఆదిలక్ష్మి, ఉష, స్వర్ణ, సుజాత, సునీత పాల్గొన్నారు. అంగన్వాడీల సమ్మెకు మంగళగిరి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి గోపిరెడ్డి మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : స్థానిక విఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాల ఎదురుగా తెనాలి విజయవాడ రహదారిపై నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు సిఐటియు, సిపిఎం పార్టీలు తమ పూర్తి మద్దతును తెలుపుతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ మంగళవారం చెవిలో పువ్వులు పెట్టుకుని అంగన్వాడీలు నిరసన వ్యక్తంచేశారు. ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని, తమ కోర్కెలు ఆమోదించి అమలు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ తెనాలి కమిటి కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడుతూ పౌష్టికాహారం అందక చిన్నారులు, బాలింతలు, గర్భిణిలు గత 5 వారాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని అయినా ప్రభుత్యం స్పందించకపోవడం శోచనీయమన్నారు. పౌష్ఠికాహారం పంపిణీ, విద్య, ప్రజారోగ్యం అందించే విషయంలో కీలక భూమిక పోషిస్తున్న అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్ వలి మాట్లాడుతూ

తాడేపల్లిలో దీక్షలకు మద్దతు తెలిపి ప్రసంగిస్తున్న వై.నేతాజీ

పెదనందిపాడులో

పెదకాకానిలో మాట్లాడుతున్న కె.పద్మ

చేబ్రోలు సమ్మె శిబిరంలో సంక్రాంతి

గుంటూరు సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సిహెచ్ నాగబ్రహ్మచారి

పొన్నూరు సమ్మె శిబిరంలో

అంగన్వాడీలకు న్యాయం జరిగేంతవరకూ ఎంత కాలమైనా తాము మద్దతు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎవిఎన్ కుమారి, పి పావని, కె జ్యోతి, హసీనా బేగం, కల్యాణి, పి రహేల్, సిహెచ్ చింతమ్మ, ఎ శివమ్మ, కె నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ : తాడికొండలో కనుమ సందర్భంగా సమ్మె శిబిరం వద్ద గోవుకు వినతి పత్రం అందించారు. సోమవారం మకర సంక్రాంతి సందర్భంగా శిబిరం వద్ద ముగ్గులపోటి నిర్వహించారు. గెలుపొందిన వారికీ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గాంధీ రాంమోహనరావు, భాస్కరరావు, సుబ్బాయమ్మ, విజయలక్ష్మి, నూరజహాన్, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి సమ్మె శిబిరంలోనే కనుమ భోజనాలు

మేడికొండూరు శిబిరంలో కోలాటంతో నిరసన

తెనాలిలో

తాడికొండలో

తుళ్లూరులో

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ : పొన్నూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో సిఐటియు నాయకులు ఎన్ రమేష్ మద్దతు తెలిపి ప్రసంగించారు. అంగన్వాడీలు కుర్చీలు తలపై పెట్టుకుని నిరసన తలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎంవి సుకన్య. యూనియన్ కార్యదర్శి డి పద్మజ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పెదకాకాని : పెదకాకాని సమ్మె శిబిరంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గులు వేసి నిరసన తెలిపారు. అంగన్వాడీలకు ఐద్వా జిల్లా కార్యదర్శి కె పద్మ మద్దతు తెలిపి ప్రసంగించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి కనకవల్లి , కే రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు :చేబ్రోలు సమ్మెశిబిరంలో ముగ్గులు వేసి అంగన్వాడీలు నిరసన తెలిపారు. ముగ్గుచుట్టూ వలయంగా బతుకమ్మ, కోలాటం ఆడారు. సమ్మెకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు సిహెచ్ హనుమంతరావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు జి వెంకటేశ్వరరావు, పోస్టల్, పెన్షనర్స్ సంఘం సభ్యులు అవనిగడ్డ వీర వర్మ తదితరులు మద్దతు తెలిపి ప్రసంగించారు.

ప్రజాశక్తి - మేడికొండూరు : సమ్మె శిబిరంలో ముగ్గులు వేసి, కోలాటం ఆడి ప్రభుత్వానికి అంగన్వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలోమేడికొండూరు మండల అంగన్వాడీవర్క అధ్యక్ష, కార్యదర్శి శ్రావణి, రజిని, ఫిరంగిపురం ప్రాజెక్టు అధ్యక్షురాలు ధనలక్ష్మి. అంగన్వాడి వర్కర్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు :అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు రోడ్డుపై మంగళవారం కనుక పండుగ జరుపుకున్నారు.ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సమస్యల పరిష్కారంలో కాలయాపన చేస్తోందని, పలితంగా రోడ్డుపై పండుగ చేసుకోవాల్సిన దుస్థితి దాపురించిందని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శి స్వర్ణలత,కరిమూన్,రజనీ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో

సాయం అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, వైసిపి నాయకులు

నష్టపోయిన గంగయ్యకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వినుకొండ

మండల కేంద్రమైన నూజెండ్లకు చెందిన గొర్రెల పెంపకందారుడు మర్రి గంగయ్య కుటుంబానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వైసిపి నాయకులు మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గొర్రెల గుంపుపై కుక్కలు దాడి చేయటంతో రూ.5 లక్షల గొర్రెలు మరణించాయని, ఆర్థిక, ఆరోగ్య కారణాలతో గంగయ్య కుటుంబం ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా తనతోపాటు కొందరు వైసిపి నాయకులు ముందుకొచ్చి రూ.లక్షన్నర అందించామని చెప్పారు. నష్టాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

కేక్‌ను కట్ చేస్తున్న జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ

అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లను తెరుస్తాం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పేదలు ఆకలి తీర్చిన అన్న క్యాటిన్‌ను జగన్మోహన్ రెడ్డి మూసివేటం దారుణమని, టిడిపి-జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నిర్వహిస్తామని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద తెలుగుయువత నాయకులు మన్నెం శివనాగమల్లేశరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాటిన్ 500 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి జీవీ ఆంజనేయులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మి నారాయణ హాజరయ్యారు. కేక్‌ను కట్ చేసి భోజనాన్ని వడ్డించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్‌మెట్‌లను, పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, నాయకులు డి.రాకేష్, సిహెచ్. శ్రీనివాసరావు, ఎం.భాను, ఎ.సాంబయ్య, కె.రామకృష్ణ, ఎ.నాగేశ్వరరావు, జానీబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ సాయిరెడ్డి

ప్రమాదాలు వాటిల్లకుండా అవగాహన

ప్రజాశక్తి - వినుకొండ

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వినుకొండ ఆర్టీసీ గ్యారేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రైవర్లు, ఇతర వాహనదార్లు, పాదచార్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిపో మేనేజర్ ఎం.కోటేశ్వరరావు నాయక్ వివరించారు. ప్రమాదాలు, ట్రాఫిక్ తదితర అంశాలపై పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరెడ్డి మాట్లాడారు. కొద్దిపాటి అశ్రద్ధ అనేక అనర్థాలకు కారణమవుతుందని, ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని చెప్పారు.

లింగారావుపాలెంలో మాట్లాడుతున్న తానా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ

వినుకొండలో బహుమతులు ప్రదానం చేస్తున్న జీవీ ఆంజనేయులు, లీలావతి

కుల, మత, ప్రాంతీయతత్వాలు లేకపోవడమే మంచిమార్గం

డివైఎఫ్ఐ సంక్రాంతి సాంస్కృతిక, క్రీడా సంబరాల్లో వక్తలు - ఉత్సాహంగా పోటీలు - విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - యడ్లపాడు

ప్రతిఏడాది మాదిరే ఈ ఏడాదీ మండంలోని లింగారావుపాలెంలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో 44వ సంక్రాంతి క్రీడా, సాంస్కృతిక సంబరాలను నిర్వహించారు. భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆదివారం, సోమవారం రెండ్రోజులపాటు నిర్వహించిన సంబరాల్లో స్థానిక యువత, విద్యార్థులు అందరూ ఉత్సాహంగా పాల్గొనగా విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. తొలిరోజు ముఖ్యఅతిథులుగా తానా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, గ్రామ పెద్దలు ఆలోకం పెద్దబ్బాయి, బహుమతులను సమకూర్చిన ఎన్నారై ఆలోకం శ్రీరామ్ తరుపున తండ్రి అమరలింగస్వామి హాజరయ్యారు. కార్యక్రమానికి సంబరాల ఆర్గనైజింగ్ కన్వీనర్ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా వెంకటరమణ మాట్లాడుతూ యువకులు క్రియేటర్లుగా మారాలని, బహుముఖ పోటీల్లో పాల్గొనడం ద్వారా వాటిల్లోని సృజన అలవడుతుందని చెప్పారు. విజ్ఞానాన్ని పెంచుకోవడం ద్వారా అజ్ఞానాన్ని తొలగించాలని సూచించారు. పేదలకు కుట్టు మిషన్ల పంపిణీ, కంటి శుక్లాల ఆపరేషన్లు, తదితర సేవా కార్యక్రమాలను తానా ఆధ్వర్యంలో చేస్తున్నామని చెప్పారు. రామన్న మాట్లాడుతూ యువత భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగం, ఇతర సమస్యలపై డివైఎఫ్ఐ పోరాటాలు, నిరుద్యోగులకు శిక్షణ కార్యక్రమాల్లో కృషిని వివరించారు. పెద్దబ్బాయి మాట్లాడుతూ ప్రజల్లో ఐక్యత ప్రధానమని, ఇలాంటి కార్యక్రమాలు అందుకు దోహదపడతాయని చెప్పారు. ఇదే వాతావరణం కలకాలం కొనసాగాలని, కార్యక్రమాలకు తమ సహకారం నిత్యం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా 10 మందికి కుట్టు మిషన్లను తానా ఫౌండేషన్ చైర్మన్ అందించారు.

బహుమతి ప్రదానోత్సవం, ముగింపు సభకు ముఖ్యఅతిథిగా డాక్టర్ గోపాల శివనారాయణ, ఎంపిటిసి టి.వీరరాఘవయ్య, సర్పంచ్ షేక్ కరీమూన్, ఎ.పెద్దబ్బాయి, కె.శ్రీహరిరావు, ఎ.వెంకట లక్ష్మీనారాయణ, ఎన్.శివరామకృష్ణ, జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. డాక్టర్ గోపాలం శివనారాయణ మాట్లాడుతూ కుల, మత, ప్రాంతీయ తత్వాల ఆలోచనల నుండి బయటకు రావడమే సమాజానికి మంచి మార్గమని చెప్పారు. వివేకానంద, భగత్‌సింగ్ ఆదర్శాలను వివరించారు. ప్రజానాట్య మండలి కళాకారులు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు, సీనియర్ కళాకారులు జగన్ గీతాలాపన ఆకట్టుకున్నాయి. క్రికెట్, షిటిల్ బ్యాడ్మింటన్, వ్యాసరచన, క్విజ్, చెస్, క్యారమ్స్, రన్నింగ్, కుండ కొట్టుడు, మార్నింగ్ స్పీడ్ నడక, తదితర 20 విభాగాల్లో పోటీలు నిర్వహించగా 400 మంది పాల్గొన్నారు. నిర్వాహక కమిటీ కన్వీనర్ ఎస్.శ్రీనివాసరావు, ఆర్.సుమన్, జి.లెనిన్, కె.గోపి, రాహుల్, సురేష్, కె.రామోజీ, సిహెచ్.రంగారావు, జి.కోటేశ్వరరావు, అనంతలక్ష్మి, శివకుమారి, ప్రగతి పర్యవేక్షించారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

పుడమి గ్రూప్స్ అధినేత ముత్తవరపు సురేష్‌బాబు, అరుణకుమారి దంపతుల ఆధ్వర్యంలో మండల కేంద్రమైన యడ్లపాడులోని రచ్చబండ సెంటర్లో క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. రంగవల్లులు, కుండకొట్టుడు, మోకులాగుడు, మ్యూజికల్స్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ తదితర పోటీల్లో మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

దుర్గి మండలంలోని ఆత్మకూరులో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో యువత, చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నపిల్లలకు మ్యూజికల్ చైర్స్, పెద్దలకు కోలాటం, కబడ్డీ పోటీలు, మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. జెవివి నాయకులు కె.ఆదినారాయణ మాట్లాడుతూ 15 ఏళ్లుగా గ్రామంలో సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇలాంటి వాటివల్ల సుహృత్‌భావ వాతావరణ ఏర్పడుతుందని చెప్పారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ బి.నాగిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు బి.లింగయ్య, సిహెచ్.రాయపరెడ్డి, పిఇటి కె.మంగయ్య, జెవివి నాయకులు కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని 32వ వార్డు విష్ణుకుండి నగర్లో కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, తెలుగు యువత ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, ఆయన భార్య అయిన శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ లీలావతి ప్రదానం చేశారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ మ బహుమతిగా ఫ్రిడ్జ్, ద్వితీయ బహుమతిగి వాషింగ్ మిషన్, తృతీయ బహుమతిగా మిక్సీ, నాలుగో బహుమతిగా సీలింగ్ ఫ్యాన్, ఐదవ బహుమతి ఐరన్ బాక్స్ అందించారు. చుక్కల ముగ్గు విభాగంలో వి.నాగజ్యోతి, డి.శైలజ, కె.దుర్గా దేవి, కె.లీలావతి, జి.కావేరి మొదటి ఐదు స్థానాల్లో నిలవగా ఆర్ట్ ముగ్గులు విభాగంలో ఎ.ప్రణీత, ఇ.శ్రీదేవి, జి.రజిని, ఎం.రాజేశ్వరి, దుర్గా భవాని మొదటి ఐదు స్థానాల్లో నిలిచారు. విష్ణుకుండి నగర్ ప్రత్యేక ముగ్గుల పోటీల్లో డి.భానులక్ష్మి, జి.నాగమణి, హేమరోపతి, రాఘవేంద్ర గెలుపొందారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రోత్సాహ బహుమతులనూ అందించారు. న్యాయ నిర్ణేతలుగా చితిరాల వల్లి, జవ్వాజి సువర్ణలక్ష్మి, కజ్జయం విజయలక్ష్మి వ్యవహరించారు. కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి దంపతులతో పాటు ఐఎఎస్ అకాడమీ ఎమ్‌డి పారా లక్ష్మయ్య, జి.వెంకయ్య, పి.నాగేశ్వరరావు, సిహెచ్ కోటేశ్వరరావు, వి.పేరయ్య, ఎం.అంజయ్య, జి.చంద్రశేఖర్, న్యాయవాదులు రామకోటేశ్వరరావు, జ్ఞానేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ వి.హనుమంతరావు, మిలటరీ వెంకట్రావు, పివీ సురేష్‌బాబు, షమీంఖాన్, ఆయుబ్‌ఖాన్, దస్తగిరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని రెంటపాళ్లలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస యాదవ్ జిల్లా అధ్యక్షులు గాదె వెంటేశ్వరావు అందించారు. ఈ సందర్భంగా అతిథులకు స్వాగతం పలుకుతూ టిడిపి-జనసేన శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. నాయకులు ఎం.రామచంద్రరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యడ్లపాడులో పోటీలను ప్రారంభిస్తున్న ముత్తవరపు సురేష్‌బాబు, అరుణకుమారి దంపతులు

దుర్గి మండలం ఆత్మకూరులో పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

రెంటపాళ్లలో బహుమతులు ప్రదానం చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, బి.శ్రీనివాసయాదవ్

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
బుధవారం 17 జనవరి 2024

జిజిహెచ్ అభివృద్ధికి దాతల సాయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం అభినంద నీయమని సూప రింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం పొదిల ప్రసాద్ బ్లాక్ లోని రెండో బ్లడ్ బాంక్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఉదయ్ ఆసుపత్రి అధినేత డాక్టర్ రామకృష్ణ రెడ్డి రూ. రెండు లక్షల ఖరీదు గల రక్త పరీక్షల రెండు పరికరాలను బ్లడ్ బాంక్ కు అందచేశారు. ఈ పరికరాలను డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రామకృష్ణా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రక్తం లోని ప్లాస్మాను, రక్త కణలను వేరు చేసే సెంట్రి ఫ్యూస్, బ్లడ్ బ్యాగ్ సీల్ పరికరాలను అందించారని చెప్పారు.ఆసుపత్రిలో రెండోబ్లడ్ బాంక్ ను ఏర్పాటు చేసి ఆపరేషన్ థియేటర్‌లకు అందుబాటులో ఉంచామని ఆయన చెప్పారు. గతంలో బ్లడ్ బ్యాంక్ కు వెళ్లాలంటె కష్టతరంగా ఉండేదని ప్రస్తుతం రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించి రెండు ఆపరేషన్ థియేటర్‌ల వద్ద బ్లడ్ బాంక్‌ను ఏర్పాటు చేయడం ఉపయోగమన్నారు. డాక్టర్ రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ గుంటూరు మెడికల్ కళాశాలలో చదివానని, తన వంతు సహాయంగా ఈ పరికరాలను అందించినట్లు చెప్పారు. డిప్యూటీ సూపరింటెం డెంట్ డాక్టర్ గోవిందా నాయక్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ సురేష్, ఆర్ ఎం ఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు పురస్కారాలు

నగదు, షీల్డులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

ప్రజాశక్తి-తెనాలి : వివిధ ప్రాంతాల్లో ట్రిపుల్ ఐటి చదువుతున్న విద్యార్థులు ఈదర విజయలక్ష్మి స్మారక నగదు పురస్కారాలు అందుకున్నారు. పట్టణానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ళ ఉమామహేశ్వర్ నివాసంలో గుడివాడకు చెందిన ఈదర విజయ లక్ష్మి స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిం చిన కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు జి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. 2023 మార్చిలో పదోతరగతిలో ఉత్తమ మార్కులతో ట్రిపుల్ ఐటీ సీట్లు పొందిన పి.రాజ్యలక్ష్మి (నూజివీడు), ఎం.తేజస్వి, ఎస్ హాసిని(ఒంగోలు), కె.జయశౌరి (నూజివీడు), టి.జనార్షిత (ఇడుపులపాయ), మరో ఇరువురికి రూ.2వేల నగదును అందిచి, షీల్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపల్ గుత్తా వెంకటరత్నం, వేజళ్ళ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థిని ఈదర విజయలక్ష్మి ఆకస్మిక మరణంతో ఆమె పేరిట ట్రస్టును ఏర్పాటు చేసి, ప్రతి ఏటా ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వేమూరి శేషగిరిరావు, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠ పురం బృందం ఈదర వెంకటపూర్ణచంద్, పావులూరి రాంబాబు, పట్టణ ప్రముఖులు ఇ.వెంకట్రావ్, ఎల్.సాయి, కె.వాసుదేవనా యుడు, జి.ప్రసాద్, కె.నందకిషోర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డివి సుబ్బారావు, శివరామకృష్ణ, గుడివాడ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో కామినేని, నాదెండ్ల

రాష్ట్ర భవిష్యత్తు కోసం కలసి పోటీ : కామినేని

ప్రజాశక్తి-తెనాలి

రాష్ట్ర ప్రయోజనాలు, పిల్లల భవిష్యత్ కోసం మార్పు అనివార్యమని అది సమిష్టి సహకారంతోనే సాధ్యమని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు యడ్లపాటి వెంకట్రావ్ నివాసానికి విచ్చేసిన ఆయన జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కామినేని వైసిపి ప్రభుత్వాన్ని, ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలు ఆశించిన దానికి ప్రస్తుతం రాష్ట్రంలో పాలనకు ఏమాత్రం పొంతనలేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనైనా మార్పు అనివార్యమన్నారు. రాష్ట్ర భవిష్యత్‌తో పాటు అన్ని వర్గాల భవిష్యత్ బాగుండాలంటే ప్రజలంతా సమిష్టిగా పనిచేయాలన్నారు. టిడిపి, జనసేన, బిజేపి సమిష్టిగా ఎన్నికల్లో పోటీ చేస్తుందని పరోక్షంగా వ్యక్తీకరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి శరణు శేషగిరి, కె.వాసుదేవ నాయుడు, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, అడపా సంపత్‌రాయుడు, హరిదాసు.గౌరీశంకర్, పి.మురళీకృష్ణ, డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

విజేతలకు బహూమతులు అందజేస్తున్న వైసిపి నాయకులు

ఆటలపోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-తాడేపల్లి

శరీరానికి వ్యాయామాన్నిచ్చే ఆటల వల్ల పిల్లల్లో ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయని వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాలసోమిరెడ్డి చెప్పారు. సంక్రాంతి సందర్భంగా నులకపేట శివదుర్గాపురం కాలనీలో మంగళవారం వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు, ఎం.ప్రకాష్, కె.శ్రీను, హసీనా, అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు

మాట్లాడుతున్న నర్రా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు: రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా ఆర్టీసి గుంటూరు-1 డిపో గ్యారేజిలో గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్.అబ్దుల్‌సలాం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జోన్-3 డిప్యూటి సిఎంఈ నర్రా శ్రీనివాసరావు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, ఇంచార్జి గుంటూరు-1 డిపో మేనేజర్ సత్యనారాయణ, చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌బాబు హాజరై భద్రతా మాసోత్సవాల గురించి సిబ్బందికి తగు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రయాణికులు భద్రతా దృష్టితోనే ఆర్టీసీలో ప్రయాణిస్తున్నారని, కావున రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ప్రయాణికులకు సురక్షిత, సౌకర్యవంతమైన, శుభప్రదమైన ప్రయాణాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఐ నేత మానికొండకు నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి

సిపిఐ నాయకులు మానికొండ ముత్యాలరావు వర్ధంతి సభ మంగళవారం తాడేపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి పి.వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ముత్యాలరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మతోన్మాద బిజెపిని ఓడించాలని వక్తలు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సాంబిరెడ్డి, జాన్‌బాబు, ఎం.డాంగే, రామారావు, బాష, ఎం.భాస్కర్, ఎ.సురేష్ పాల్గొన్నారు.

28 నుంచి మస్తాన్ దర్గా ఉరుసు

ఆహ్వానపత్రిక ఆవిష్కరించిన ఎంపి అయోధ్యరామిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నల్ల మస్తానయ్య దర్గాకు ఎంతో ప్రసిద్ధి చెందిందని రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు . సోమవారం పెదకాకానిలోని ఆయన నివాసంలో అయనను గుంటురులో ప్రసిద్ధ హజరత్ సయ్యద్ కాలే మస్తాన్ బాబావారి దర్గా అనువంశిక ధర్మకర్త రావి రాంమ్మోహన రావు తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. దర్గా సంప్రదాయం ప్రకారం అయోధ్య రామిరెడ్డిని సన్మానించారు. మస్తానయ్య 132వ

ఉరుసు నిర్వహణ ఆహ్వాన పత్రిక పోస్టర్‌ను ఆయన చేత ఆవిష్కరింపజేశారు. ఈసందర్భంగా అయోధ్యరా మిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా గుంటూరు మస్తానయ్య ఉరుసు మహోత్సవాలు పెద్ద ఎత్తున విజయవంతంగా జరుగుతుంటాయని అదే క్రమంలో ఈనెల 28 తేదీన ఉరుసు మహోత్సవం ప్రారంభమవు తుందన్నారు. ఉరుసు జరిగే రోజుల్లో దర్గా అనువంశిక ధర్మకర్త రావి రామ్మోహన్ దంపతులు అన్నదానం నిర్వహిస్తారన్నారు. కుల మత భేదాలకు అతీతంగా లక్షలాదిగా దేశం నలుమూలల నుంచి భక్తుల రాకకు తగ్గట్టు ఏర్పాట్లు వుంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపి మోదుగుల వేణుగోపా లరెడ్డి , మాజీ ఎమ్మెల్యే జియాఉద్దీన్, వైసిపి నాయకులు ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి రత్నాల చెరువు ఎస్టి కాలనీలో పోలమ్మ వెంకటేశ్వరరావు పూరిగుడిస అగ్ని ప్రమాదం వల్ల పూర్తిగా తగలబడి నిరాశ్రయులయ్యారు. నడి రోడ్డున పడ్డ కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి వారికి వంట సామాగ్రి, నిత్యవసర సరుకులు, బట్టలు, కొంత ఆర్థిక సాయం గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పారేపల్లి మహేష్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాస్, యువజన అధ్యక్షుడు ఆల శివాజీ యాదవ్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు మంద్రు సత్యనారాయణ, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్డు ధనుంజయ్ దుగ్గిరాల మండల అధ్యక్షురాలు మాదు నాగదుర్గ మధు వెంకటేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎనుముల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాదిగ మహానాడు వ్యవస్థాపకులు బోయలపల్లి ప్రభాకర్

తాడికొండ సీటు పులి చిన్నాకివ్వాలి : బోయపల్లి

ప్రజాశక్తి - తుళ్లూరు

తాడికొండ అసెంబ్లీ సీటు మాదిగలకు కేటాయించాలని మాదిగ మహానాడు వ్యవస్థాపకులు బోయలపల్లి ప్రభాకర్ మాదిగ టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఉద్దండరాయునిపాలెంకు చెందిన పులి చిన్నా కు అవకాశం కల్పించాలని కోరారు. రాజధాని ప్రాంతం తుళ్లూరులోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా టిడిపి తాడికొండ అసెంబ్లీ స్థానాన్ని మాదిగలకు కేటాయించలేదన్నారు. తాడికొండ నియోజక వర్గంలో మాదిగల సంఖ్య గణనీయంగా ఉందని, అమరావతి ఉద్యమంలో పాల్గొంటూ, అనేక దాడులకు, అక్రమ కేసులకు వెరవకుండా టిడిపి విజయం కోసం నిరంతరం కృషి చేస్తున్న పులి చిన్నాకు తాడికొండ స్థానాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కె రమేష్, బి జక్రయ్య, పి ఆనంద్, కటారి అశోక్ పాల్గొన్నారు.

ఎపిసిసి అధ్యక్షురాలిగా షర్మిల నియామకంపై కాంగ్రెస్ నేతలు హర్షం

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలుగా వైయస్ షర్మిల నియమితులు అవటం పట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ కుర్రా పున్నారావు, పలువురు ఓబీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పున్నారావు మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలుగా వైయస్ షర్మిల నియామకంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమై పూర్వ వైభవం వస్తుందన్నారు. మంగళగిరి, తాడేపల్లి పట్టణాల ఓబీసీ చైర్మన్లు దామర్ల వీరప్రసాద్, లోడకల శ్రీనివాస్ యాదవ్, మంగళగిరి, దుగ్గిరాల మండలాల పార్టీ ఓబీసీ చైర్మన్లు తాతామహేశ్వరరావు, పసుపులేటి నాగయ్య, పార్టీ ఓబీసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలే హేమచంద్రరావు తదితరులు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.ఏపీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నియామకం పట్ల యువజన కాంగ్రెస్ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తాయి సుధీర్ హర్షం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో ఏపీలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మాట్లాడుతున్న చందుసాంబశివుడు

ప్రజాశక్తి-తెనాలి :ఏపి పిసిసి ఛీఫ్‌గా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల నియామకం హర్షణీయమని, ఆమె రాకతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కానుందని ఆ పార్టీ తెనాలి నియెజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు అన్నారు. స్థానిక మారీసుపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తెలంగాణాలో కాంగ్రెస్ గెలుపులో షర్మిల కీలకంగా వ్యవహరించారని, ఇప్పుడు ఆమె రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో పార్టీ మరింత బలోపేతం కానుందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీలో చేరిన పలువురికి కండువాలుకప్పి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో పి.నాగసూర్యశశిధరరావు, కె.బుల్లియ్య, శివప్రసాద్, స్టీవెన్‌బాబు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి వీవర్స్ కాలనీ నగరపాలక సంస్థ హైస్కూల్లో స్థానిక గణపతి నగర్లోని ఇందిరానగర్ డాక్టర్ వైఎస్‌ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష మంగళవారం మీడియాకు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. శిబిరంలో ఆర్థోపెడిక్, గైనకాలజీ, నేత్ర, ఇతర వైద్యులు సేవలందిస్తారన్నారు. ఉచిత వైద్యసేవలు, మందులు, ఉచిత కళ్లజోళ్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఐదవ సచివాలయంకు సంబంధించి వీవర్స్ కాలనీ పరిధిలో జరిగే సురక్ష వైద్య శిబిరంకు ఇప్పటికే కాలనీలోని ప్రతి ఇంటికి ఏఎన్‌ఎంలు, ఆశాలు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులను గుర్తించడం జరిగిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సాంస్కృతిక భావజాల విప్లవకారుడు త్రిపురనేని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగు సమాజంలో కవి రాజు తన హేతువాద భావజాలంతో సాంస్కృతిక విప్లవకారుడిగా చరిత్రలో ప్రసిద్ధి చెందారనికేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, సుప్రసిద్ధ సాహితీవేత్త పాపినేని శివశంకర్ తెలిపారు. మంగళవారం ఉదయం కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి వర్ధంతి సందర్భంగా రాయపాటి వెంకట రంగారావు (ఆర్.వి.ఆర్.) జె.సి. కళాశాలలో సభ జరిగింది. ఈ సభకు త్రిపురనేని రామస్వామి చౌదరి సాహితీ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గద్దె మంగయ్య, అలోకం పెద్దబ్బాయిలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ సాహిత్య రంగంలో త్రిపురనేనిని ప్రత్యేకస్థానం అన్నారు. అలోకం పెద్దబ్బాయి మాట్లాడుతూ తెలుగు సమాజంలో సాహిత్య ,సాంస్కృతిక, భావజాల రంగాల్లో తన హేతువాదంతో త్రిపురనేని రామస్వామి చౌదరి అగ్రకుల బ్రాహ్మణ బాబాజాలంపై పోరాటం చేశారన్నారు. ఈ సందర్భంగా కవి, జర్నలిస్ట్ బి.విల్సన్‌కు పాపినేని శివశంకర్, ఆర్.వి.ఆర్. జె.సి. కళాశాల కరస్పాండెంట్, పారిశ్రామికవేత్త గద్దె మంగయ్య కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం మాజీ రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు ప్రముఖ సాహిత్య పరిశోధ కుడు పారా అశోక్ కుమార్, వల్లూరి తాండవ కష్ణ, రచయిత జొన్నలగడ్డ రామారావు పాల్గొన్నారు.

చైతన్య మానవి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమాదేవి , కాకుమాను నాగేశ్వరరావు తదితరులు

చైతన్య మానవి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

న్యాయమైన పోరాటాల ద్వారా మహిళల్లో చైతన్యం కల్పించేందుకు ప్రచురిస్తున్న చైతన్య మానవి పుస్తకం ప్రతి ఒక్క మహిళ చదవాల్సిన ఆవశ్యకత ఉందని మహిళా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి అన్నారు. మంగళవారం పెదనందిపాడు అంగన్వాడీ సమ్మె శిబిరంలో చైతన్య మానవి పుస్తకాన్ని నాయకులు కాకుమాను నాగేశ్వరరావు తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడి మండల సంఘ అధ్యక్ష కార్యదర్శులు శివపార్వతి శ్రీదేవి పలు గ్రామాల నుంచి విచ్చేసిన అంగన్వాడీలు పాల్గొన్నారు.

డాక్టర్ రమణ యశస్వికి సంక్రాంతి పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

డాక్టర్ రమణ యశస్విని సత్కరిస్తున్న అవగాహన సభ్యులు

వైద్యులుగా, కవిగా డాక్టర్ రమణ యశస్వి రాణిస్తూ, బహుముఖ ప్రజ్ఞాశాలిగా అందరి అభిమానాన్ని చూరగొంటున్నారని పలువురు వక్తలు కొనియాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అవగాహన ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ప్రముఖ వైద్యులు, కళారత్న డాక్టర్ రమణ యశస్వికి సంక్రాంతి పురస్కారం అందచేసి, ఘనంగా సత్కరించారు. ఎస్‌హెచ్ఒ అధ్యక్షులు డాక్టర్ టి.సేవాకుమార్ మాట్లాడుతూ వైద్య, సేవా, సామితీ రంగాల్లో అద్భుతంగా సేవలు అందిస్తున్న నిత్య కృషీవలుడు రమణ యశస్వి అన్నారు. యశస్వికి సంక్రాంతి పురస్కారం అందించటం ముదావహం అన్నారు. మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వివి రామ్‌కుమార్ మాట్లాడుతూ రమణ యశస్వి డాక్టర్‌గా తన వృత్తి ధర్మాన్ని గౌరవంగా నిర్వహిస్తూ విద్యార్థులకు వైద్య పాఠాలే కాక జీవిత పాఠాలనూ నేర్పుతూ, విలువలను అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపూడిలో బహుమతి ప్రదానం చేస్తున్న ఈమని అప్పారావు

ఆటలతో మానసిక ఉల్లాసం

జిల్లాలో ఐద్వా, డివైఎఫ్ఐ, సిఐటియు, వ్యకాస ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు

కాజలో ఆటల పోటీల్లో బాలలు

కాజలో క్రీడోత్సవాల ముగింపు సభ, హాజరైన గ్రామస్తులు

దుగ్గిరాలలో

తాడేపల్లిలో

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని కాజా గ్రామంలో డివైఎఫ్ఐ, ఐద్వాల ఆధ్వర్యంలో ఆర్దల సూర్యనారాయణ క్రీడా ప్రాంగణంలో అప్పికట్ల శ్రీనివాసరావు, సింహాద్రి బసవ పున్నయ్య స్మారక సంక్రాంతి ఆటల పోటీలను శుక్రవారం ప్రారంభమైన పోటీలు సోమవారం ముగిశాయి. 12 నుండి 15 వరకు ఈ పోటీలను ఆయా కమిటీలు నిర్వహించాయి. నాలుగు రోజులు పాటు జరిగిన ఈ ఆటల పోటీలలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరి రోజు జరిగిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరింపజేశాయి. స్లో సైకిల్‌లో చిన్నారులు రెట్టింపు ఉత్సాహంతో తమ ప్రదర్శనలు అందించారు. ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన యువతకు సోమవారం బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి కృష్ణ కాంత్, ఐద్వా నాయకులు సింహాద్రి సుమ, ఆర్దల శ్యామల జ్యోతి, డివైఎఫ్ఐ నాయకులు బొమ్ము త్రికేష్, దొడ్డక వి ఎస్ నరేష్, సింహాద్రి భూపాల్, గాదె సంజయ్, మాణిక్యాల రాజేష్, ఆర్దల సాయి ప్రసాద్, ఐద్వా నాయకులు నిర్మల, గాదె సుధారాణి, ఎస్ శిరీష, జయశ్రీ, అప్పికట్ల ప్రకాష రావు, సింహాద్రి ఆదిశేఖర్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు గ్రామంలో శ్రీ నిమ్మగడ్డ రామ్మోహన రావు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఐద్వా, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సహకారంతో సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలతకు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు ముసలి పకీరయ్య, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వుద్దంటి దుర్గారావు, చిట్టేల సీతారామాంజనేయులు, గడ్డం అజయ్ కుమార్, మునగాల సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

సంక్రాంతి పండుగ సందర్భంగా పట్నంలోని ఒకటో వార్డు లో ఐద్వా, డివైఎఫ్ఐ, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు రన్నింగ్, డాన్స బేబీ డాన్స్, పలు రకాల క్రీడాలని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఏ రవిచంద్రన్ అధ్యక్షతన సభలో సిఐటియు సీనియర్ నాయకులు జె వి రాఘవులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వివి జవహర్లాల్, నిర్మల జూనియర్ కళాశాల డైరెక్టర్ వివి ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు వీరబాయి, వివిధ ప్రజా సంఘాల నాయకులు జగన్నాథం, వి వెంకటేశ్వరరావు, కే వెంకటేశ్వర్లు, ఏ వెంకటేశ్వర్లు, ఏ శ్రీనివాసరావు, వి సాయి, టీ మనోజ్, ఏ సాయి, కే రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో : పట్నంలోని మూడు, నాలుగు వార్డుల్లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మూడు చోట్ల సంక్రాంతి పండుగ సందర్భంగా ఆటలు పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, రన్నింగ్, మ్యూజికల్ చైర్, డాన్స బేబీ డాన్స్ వివిధ రకాల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె వి ఎస్ సాయి ప్రసాద్, సిఐటియు సీనియర్ నాయకులు జె వి రాఘవులు, సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య, డివైఎఫ్ఐ నాయకులు ఎస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

శరీర దారుఢ్యానికి ఆటలు దోహదపడతాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్‌నగర్ సెంటర్‌లో ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి డి.చినదుర్గారావు అధ్యక్షత వహించారు. అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి క్రీడలపై ఆసక్తి ఉంటే మండలానికో క్రీడా ప్రాంగణాన్ని నిర్మించాలన్నారు. ఆడుదాం ఆంధ్ర పేరుతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించినా ప్రయోజనం లేదన్నారు. క్రీడా మైదానాలు లేకుండా క్రీడాకారులకు సరైన వసతులు కల్పించకుండా క్రీడలను ఎలా ప్రోత్సహిస్తారని ప్రశ్నించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.ప్రభాకరరావు, జయరావు, నవనీతం, ఎం.చినచెన్నయ్య, సాయి, శ్రీకాంత్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల

సంక్రాంతి సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రం దుగ్గిరాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలోతాడిబోయిన రామస్వామి, బి అమ్మిరెడ్డి, జే బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపూడిలో : ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించే కార్యక్రమం మంగళవారం సాయంత్రం తుమ్మ పూడి లో జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ కార్మిక సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు, అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంగం జిల్లా అధ్యక్షులు ఎం నాగమల్లేశ్వరావు, ప్రజాశక్తి ఏడిటోరి యల్ బోర్డు సభ్యులు వి సురేష్, స్థానిక నాయకులు గుడిసె యోహాను, ఎం నరసింహారావు, బుస్సా చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంలో యువత చెడు నడత లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పాతగుంటూరులో బహుమతి ప్రదానం చేస్తున్న ఎ.కళ్యాణి

కాజలో బహుమతి ప్రదానం చేస్తున్న సింహాద్రి సుమ

ప్రజాశక్తి-గుంటూరు :సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గుంటూరులో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా), డివైఎఫ్ఐ, సిఐటియు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పాతగుంటూరు, కృష్ణనగర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు వివిధ క్రీడా పోటీలు నిర్వమించారు. ఈ సందర్భంగా ఐద్వా నగర కార్యదర్శి కళ్యాణి మాట్లాడారు. ముగ్గుల పోటీ, లెమన్ అండ్ స్పూన్, పరుగు పందెంలో పాల్గొని గెలుపొందిన వారికి సిఐటియు నాయకులు టి.శ్రీనివాసరావు, కుమార్, వాస్తవ్, యూనియన్ బ్యాంక్ సీనియర్ ఆఫీసర్ వేణురాందాస్, బెఫి నాయకులు టి.రాము, ఐద్వా నాయకులు కృష్ణకుమారి, ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కార్తీక్, ఐద్వా నాయకులు మాధవి, శైలజ, శివకుమారి, అనురాధ పాల్గొన్నారు.

ఆత్మకూరులో బహుమతి ప్రదానం చేస్తున్న పి.బాలకృష్ణ

మంగళగిరిలో బహుమతి ప్రదానం చేస్తున్న డాక్టర్ సాయి ప్రసాద్